క్లుప్తంగా

ఇచ్చోడలో ఎన్‌సీసీ- ఏ సర్టిఫికెట్ పరీక్ష



పరీక్ష రాస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షల్లో గిరిజన గురుకుల బాలుర పాఠశాల, సోనాల జిల్లా పరిషత్ పాఠశాలతో పాటుగా ఆదిలాబాద్‌కు చెందిన 92 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నట్లు ఎన్‌సీసీ సీవోలు రాజేంద్రప్రసాద్, అన్వర్‌లో తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా రవీందర్


బోరు రవీందర్

బోథ్: కేంద్రం టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా సోనాల మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు బోరె రవీందర్ నియమితులయ్యారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు నగేశ్ సిఫార్సు మేరకు కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య రవీందర్‌ను నియమించారు. ఆయనను గ్రామస్తులు, యువశక్తి సభ్యులు శాలువాతో సత్కరించారు.

రక్తదానం

బోథ్: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఓ మహిళకు అత్యవసరంగా రక్తం అవసరం ఉండగా.. సోనాల మండల కేంద్రానికి చెందిన నవనిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పడిగెల నాగరాజు నిర్మల్‌కు చేరుకుని రక్తాన్ని దానం చేశారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసిన నాగరాజుకు మహిళ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సన్మానం

నార్నూర్: ప్రధాన్ సమాజ్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం గాదిగూడ మండల కేంద్రంలోని హిరాసుక్క కమ్యూనిటీ హాల్‌లో ప్రధాన్ సమాజ్ పెద్దలు ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు ఉయిక సుదర్శన్ మాట్లాడుతూ ప్రధాన్‌సమాజ్ అభివృద్ధికి సంఘం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వామన్, గెడం పరుసురాం, తొడసం శ్యాంరావు, సీడాం వామన్, భారత్, హెచ్‌కే పాండురంగ్, గంగారాం, మారోతి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తాంసి: మండల కేంద్రానికి చెందిన కోట్రంగి అశోక్ అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. కాగా యువకుడి వైద్యచికిత్స కోసం గ్రామానికి చెందిన పలువురు తమవంతుగా దాతలు సాయం అందిస్తున్నారు. గ్రామానికి చెందిన శివగణేష్ సీడ్స్ షాప్ తరపున శ్రీకాంత్ రూ.5వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ సర్పంచ్ కృష్ణ, యువకులు అశోక్, శ్రీనివాస్, రాజు ఉన్నారు.

'బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం'

బోథ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మధ్యతరగతి, పేద వర్గాలకు ఎటువంటి లబ్ధి చేకూరే అంశాలు లేవని, కేవలం కార్పొరేట్ వర్గాలకు లాభం చేకూరే విధంగా ఉందని ధర్మ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. ఆదివారం నాయకులతో కలిసి మాట్లాడారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. జిల్లాలో విమానాశ్రయం, నవోదయ విద్యాలయాలు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయలేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నా జిల్లాకు మొండి చేయి చూపించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, నరేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ బాధ్యులు

ఎదులాపురం: జిల్లాలోని ప్రసిద్ధ, పట్టణ శివారు చాందా వద్ద గల రాజన్ షా వాలి బాగ్ సవార్ దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలని దర్గా కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 4 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు ముహమ్మద్ అష్రఫ్, ఉపాధ్యక్షుడు ఖ్వాజా సిరాజుద్దీన్, ముహమ్మద్ అబుజార్, ఖయ్యూమ్ రజా, అయూబ్ ఖాన్, గౌస్ ఖాన్, షేక్ షహన్షా పాల్గొన్నారు.

నూనెగింజల సాగు అంతంతే..!

- సాగుకు అనుకూలమైన నేలలు
- అయినా ముందుకు రాని రైతులు
- సాగుపై అవగాహన కరువు


తాంసిలో సాగవుతున్న వేరుశనగ పంట

ఇచ్చోడ: నియోజకవర్గంలో నూనె గింజల పంటలకు నేలలు అనుకూలం అయినప్పటికీ రైతులు సాగుపై ఆసక్తి చూపడం లేదు. సంబంధిత అధికారులు అవగాహన కల్పించకపోవడమే ఇందుకు కారణం. నువ్వులు, పొద్దుతిరుగుడు పువ్వు, వేరుశనగ, కుసుమ పంటల సాగుపై రైతులకు సరైన ప్రోత్సాహం ఇవ్వక పోవడంతో చాలా మంది రైతులు పంటల సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు.

మార్కెట్లో మంచి ధరలు..

మార్కెట్లో నూనె గింజలకు మంచి ధరలు ఉన్నాయి. క్వింటాల్ నువ్వుల ధర రూ. 9 నుంచి రూ. 10 వేలు, కుసుమలు రూ. 6 వేల నుంచి రూ. 8 వరకు, పొద్దుతిరుగుడు రూ. 8 వేలు, వేరుశనగా రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకు ధర లున్నాయి. కాని నూనె పంటలకు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మద్దతు ధరలతో కొనుగోళ్లు చేయక పోవడంతో రైతులు ఈ పంటల సాగుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. పంటలకు విక్రయించుకోవడానికి ప్రధానంగా మార్కెట్ లేక పోవడం కూడా కారణం అవుతుంది.

ప్రోత్సాహం కరువు..

నూనె గింజల పంటలకు సాగుకు సంబంధిత వ్యవసాయ అధికారుల నుంచి రైతులకు సరైన ప్రోత్సాహం లేక పోవడంతో రైతులు పంటల సాగుకు ముందుకు రావడం లేదు. గతంలో వ్యవసాయ శాఖ నుంచి సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసే వారు కానీ గత పది సంవత్సరాల నుంచి సబ్సిడీ ఎత్తివేయడంతో రైతులకు విత్తన కొనుగోళ్లు భారంగా మారుతోంది.

సాగు వివరాలు..

నియోజకవర్గ వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో ఈఏడాది యాసంగిలో పొద్దుతిరుగుడు 14 ఎకరాల్లో, వేరుశనగా 4 వందల ఎకరాల్లో, జిలుగు 5 ఎకరాల్లో, కుసుమ 8 ఎకరాల్లో, నువ్వులు 120 ఎకరాల్లో మాత్రమే సాగువుతున్నాయి.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



నూనె పంటలను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలి. పండించిన పంటలకు విక్రయించడానికి సరైన మార్కెట్ లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఆశించిన స్థాయిలో ధరలు రావడం లేదు. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

– దత్తు, అడేగామ(బి)

సబ్సిడీపై అందించాలి



ప్రతీ ఏటా యాసంగిలో పండించే నూనె పంటలకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై విత్తనాలు అందించాలి. దీంతో రైతులకు భారం కాకుండా ఉంటుంది. నూనె పంటల విత్తనాలు అధిక ధర ఉన్నాయి.

– కుంర యాదవ్‌రావు, కోసుపటేల్‌గూడ

అవగాహన కల్పిస్తున్నాం



యాసంగిలో నూనె పంటల సాగు కోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నూనె పంటలకు ఇక్కడి నేలలు అనుకూలమే. ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా నూనె గింజల సాగు చేపట్టాలి.

– జాదవ్ కైలాస్, వ్యవసాయాధికారి, ఇచ్చోడ

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తాంసి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని గోట్కూరి గ్రామంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలను మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గత శతాబ్ద కాలంగా సీపీఐ అన్నివర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిలుక దేవిదాస్, కుంటాల రాములు, రాజమౌళి, కిష్టయ్య, సట్వాజీ, రమేశ్, కట్ట స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితేనే భవిష్యత్


పరిశీలిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పదో తరగతి విద్యార్థుల ప్రయోజనార్థం ఆదివారం జిల్లా కేంద్రంలోని విద్యార్థి కళాశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మాక్ పరీక్ష నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. పదో తరగతి పరీక్షలు జీవితానికి పునాదిలాంటివని, మంచిగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి ఆదిలాబాద్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. త్వరలోనే కెరీర్ గైడెన్స్‌పై కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు శాంతన్‌రావు, చరణ్‌గౌడ్, రూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, రాంరెడ్డి, రఫిక్, దేరా కృష్ణారెడ్డి, గడ్డం అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంతో మందికి ఆదర్శం పోశెట్టి సార్




పోశెట్టి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: బోథ్ మండల విద్యాధికారిగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన కుమ్మరి పోశెట్టి ఎంతో మందికి ఆదర్శమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కుమ్మరి పోశెట్టి- దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, నిర్మల్ జిల్లా మాజీ గ్రంథాయలం చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, కుమ్మరి కృష్ణ, వైద్యులు కార్తీక్, న్యాయవాది విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మించుకోవడం అభినందనీయం

ఇచ్చోడ: భక్తుల విరాళాలతో కల్యాణ మండపం నిర్మించుకోవడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో వైష్ణవసదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్‌తో కలిసి కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా విఠలేశ్వర ఆలయ ఆవరణలో ప్రతీ ఆదివారం క్రమం తప్పకుండా నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే సంత్‌సంగ్‌కు వేల సంఖ్యలో వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, నిమ్మల ప్రీతంరెడ్డి, లోకిరి శ్రీరెడ్డి, గాడ్గే సూభాష్, పాండురంగ్, నర్వడే రమేశ్ పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు


సన్మానిస్తున్న సూర్యవంశీ పండరి

నార్నూర్: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మాతంగ్ ఋషి సంస్కార సంఘం వ్యవస్థాపకులు సూర్యవంశీ పండరి అన్నారు. ఆదివారం మండలంలోని తడిహత్నూర్ మతంగ్ సమాజ జీవన జన జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మతంగ్ సమాజం మూఢనమ్మకం, చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారన్నారు. ప్రతీరోజు ధ్యానం చేసుకోవాలి, తల్లిదండ్రులకు సేవ చేయాలి, యోగా, వ్యాయమం చేయాలని సూచించారు. నేషనల్ మెటరియాంజి ఒంపియాడ్ ఎర్త సైన్స్ క్లేమెట్ చేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన కుమారి సోనీ, నాందేవ్ సోన్ కాంబ్లేలను సన్మానించారు. కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, పాండురంగ్, సదాశివ్ మిటే, కలవలే అరవింద్, వాగ్మారె వామన్ పాల్గొన్నారు.

టీపీసీసీ ధర్నాలో పాల్గొన్న ఆడే గజేందర్


ధర్నాలో ఆడే గజేందర్

నేరడిగొండ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల చూపిన వివక్షను నిరసిస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సభకు తరలిరండి


డప్పులతో దరువు వేస్తున్న నాయకులు

బోథ్: ఫిబ్రవరి 7న లక్షల డప్పులు.. వేల గొంతుకల సభకు తరలిరావాలని రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో డప్పులతో దరువు వేశారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను వివరించి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, అన్నెపాక అశోక్, సాగర్, భిక్క అశోక్, రవి, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీగా మార్చాలని వినతి


ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరామ మందిర వార్షికోత్సవం


హోమం చేయిస్తున్న వేదపండితులు సాయినాథ్ శర్మ

బేల: మండల కేంద్రంలోని శ్రీరామ మందిరంలో ఆదివారం వసంత పంచమిని పురస్కరించుకుని మొదటి వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీరాములోరికి ప్రత్యేక అభిషేకం, శ్రీలక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి హోమ కార్యక్రమాలను వేదపండితులు సాయినాథ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓల్లఫ్‌వార్ దేవన్న, ప్రధాన కార్యదర్శి గుండవార్ అనిల్, సభ్యులు మోహన్ మాన్కర్, జనార్దన్ గౌడ్, రవి, ప్రీతం, సాగర్ పాల్గొన్నారు.

'జిల్లా ప్రజలను మోసం చేసిన కేంద్రం'


మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లా ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీజేపీకి ఓట్లు వేస్తే శ్రీరామ రాజ్యం పాలన అందిస్తామని నమ్మించి ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలు గెలిచారన్నారు. ఆదిలాబాద్‌లో సీసీఐ పరిశ్రమ, టెక్స్‌టైల్ పార్క్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించకుండా ఉండటం వారి అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. సమావేశంలో నాయకులు ఇజ్జగిరి నారాయణ, ధమ్మపాల్, కొండ గణేష్, సతీష్, దేవిదాస్, శ్రీనివాస్, సురేందర్, రాహుల్, షేక్ ఆలం పాల్గొన్నారు.

భక్తిమార్గంలో పయనించాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జైనథ్ మండలంలోని సావాపూర్ గ్రామంలో శ్రీ సీతా సమేత రామలక్ష్మణ విగ్రహాలతో పాటు శ్రీ బాజీరావు బాబా నూతన విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బాబా ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో సావాపూరే విజయ్, అడప తిరుపతి, చంద్రయ్య, కుమ్ముల సునీల్, మాజీ సర్పంచ్ విజయ్, రవీందర్, శివారెడ్డి పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి


సన్మానిస్తున్న సినీ నిర్మాత డాక్టర్ రవికిరణ్ యాదవ్

ఆదిలాబాద్‌రూరల్: యాదవ సంఘ బలోపేతానికి జిల్లా కార్యవర్గం కృషి చేయాలని సినీ నిర్మాత డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా యాదవ సంఘ భవనంలో అధ్యక్షుడు కాడిగిరి రఘువీర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా యాదవ సంఘం బాధ్యులు కాసవేణి నారాయణ యాదవ్, భీమన్న యాదవ్, పందరి యాదవ్‌ల ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అసుర హన్మాండ్లు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మంచాల పెద్ద మల్లయ్య యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఇదివరకు జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందించిన కాడిగిరి రఘువీరా యాదవ్‌ను శాశ్వత ఆహ్వాన అధ్యక్షుడిగా ప్రకటించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ యాదవ్, కృష్ణమీనన్, సుధాకర్ యాదవ్, ప్రకాష్ యాదవ్, గణేష్ యాదవ్, వెంకట్ యాదవ్, ఆశన్న యాదవ్, ప్రఫుల్ యాదవ్, రమేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు


పీజీలో అడ్మిషన్ పొందుతున్న శ్రీకర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూస్తామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్ కళాశాలకు 72 పీజీ సీట్లకు సంబంధించి వైద్యులు చేరాల్సి ఉండగా, ఆదివారం నాటికి 28 మంది చేరినట్లు తెలిపారు. జనరల్ మెడిసిన్, అనస్తీషియా, పల్మనాలజీ, ఆర్థోపెడిక్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు చేరినట్లు పేర్కొన్నారు. కాగా 2017 నుంచి 2023 వరకు రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన నిర్మల్‌కు చెందిన వైద్యుడు శ్రీకర్ రెడ్డి మళ్లీ ఇదే కళాశాలలో పీజీ సీట్ పొందినట్లు పేర్కొన్నారు.

సుధీర్‌కుమార్‌కు ప్రతిభామూర్తుల పురస్కారం


పురస్కారం అందజేస్తున్న మాజీ స్పీకర్

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కే) గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ శనివారం రాత్రి హైదారాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభమూర్తుల పురస్కారాన్ని మాజీ శాసన సభస్పీకర్ మధుసుదనాచారి చేతుల మీదుగా అందుకున్నారు. తెలంగాణ బాషా సంస్కృతి శాఖ, సేవా పౌండేషన్, సత్యసంగీత ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సుధీర్‌కుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కరోనా సమయంలో పేదలకు అన్నదానం నిర్వహించడంతో పురస్కారం అందచేసినట్లు ఆయన తెలిపారు. మాజీ బీసీ కమిషనర్ వకుళాభరణం కృష్ణమోహన్‌లు ఉన్నారు.

ఘనంగా బోనాలు

బోథ్: మండల కేంద్రంలోని కొట్టాల పోచమ్మ ఆలయంలో ఆదివారం మహిళలు బోనాలు సమర్పించారు. మూడు రోజుల పాటు పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించిన అనంతరం ఆదివారం మహిళలు బోనాలు సమర్పించారు. గ్రామంలో పోతురాజులు విన్యాసాలతో ఆకట్టుకున్నారు. పోచమ్మ పాటల మధ్య నృత్యం చేశారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం



తాంసి మండలంలోని గోట్కూరి గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డ్రెయినేజీలు శుభ్రం చేయక మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. అలాగే చుట్టూ పక్కల వారికి తీవ్ర దుర్గంధం వస్తుందని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పూడికతీయాలని ప్రజలు కోరుతున్నారు.

– తాంసి